అప్పటికి దాదాపు వారం రోజులుగా జాన్ కన్పించడం లేదెందుకో! పిల్లల స్కూలుకెదురుగా నున్న పువ్వుల దుకాణంలో పూలు కొంటూ, ఆదివారాలు పార్క్‌లో పండిపోయిన గుబురు మీసాల చాటు నుండి ముసి ముసినవ్వులు నవ్వుతూ, ఆడుకునే పిల్లలను పరిశీలనగా చూస్తూ లోకంలోని ప్రేమ నంతా తనకళ్ళల్లోనే నింపుకుని తన భార్య "జెన్నీ" తప్ప తనకు మరో లోకమే లేదన్నట్లు ఎప్పుడూ జెన్నీ గురించిన కబుర్లే చెబుతూ గలగలా నవ్వుతుండే జాన్ కన్పించకుంటే ఎందుకో ఏదో వెలితిగా అన్పించసాగింది.

# ప్రేమికుడు

## ~ మాచర్ల హేమ

అసలు జాన్‌తో పరిచయం అనుకోకుండా కల్గింది. ఒక రోజు ఏదో కొనాల్సొచ్చి దగ్గర్లో ఉంది కదా అని ఓ చిన్న కార్నర్ షాప్‌కి వెళ్ళాను. నాకు కావల్సిన వస్తువుకోసం షాప్‌లో చూస్తుండగా అనుకోకుండా జాన్ షాప్ అసిస్టెంట్‌తో మాట్లాడే మాటలు చెవిన బడ్డాయి. పెద్దగా నవ్వుతూ చేతిలోని ఏదో ఫొటో షాప్ అసిస్టెంట్ లూసికి చూపెడూ 'ఉడ్‌యు బిలీవ్‌ట్ షి విల్ బి సిక్స్‌టీ ఇన్ నెక్స్ట్ మంత్' సంభ్రమంగా అంటున్నాడు. 'ఓ. నో షి లుక్స్ సో యంగ్ అండ్ బ్యూటీఫుల్' అంటూంది షాప్ అసిస్టెంట్ లూసీ.

వేరేవాళ్ళ మాటలు వినకూడదని తెల్సినా ఎందుకో జాన్ తన భార్య గురించి చెప్తుంటే ఒక విధమైన కుతూహలం రేగింది నాలో.

'లాస్ట్ బర్త్‌డేకి ఏమడిగిందో తెల్సా? క్రొత్తగా షాప్‌లో కొచ్చిన గోల్డ్ కలర్ డ్రెస్ కొనుక్కుంటే ఏమైనా అనుకుంటారా అంటూ,నేనన్నాను గోల్డ్ కలర్ డ్రెస్ కాదు. గోల్డ్‌తో చేసిన డ్రెస్ కొనుక్కున్నా నాకేం అభ్యంతరం లేదన్నాను. నేనే తనవాడినయినప్పుడు, నా జీవితమే తన దైనప్పుడు, నేను సంపాదించే ప్రతి పైసా తనదే కదా! అవునా కాదా నువ్వే చెప్పు?' అంటూ షాప్ అసిస్టెంట్‌ని ప్రశ్నిస్తూ తను కొనుక్కున్న వస్తువుకు ధర చెల్లించి వెళ్ళి పోబోతూ నన్ను చూసి ఒక్క క్షణం ఆగి 'హలో' అంటూ చిరుగా నవ్వుతూ 'మీ ఇండియన్స్ కట్టే రకరకాల రంగు రంగుల చీరలంటే నా భార్యకు అమితమైన మోజు. ఈఇంగ్లండ్‌లో పుట్టేబదులు చీరలు కట్టుకోడం కోసమైనా ఇండియాలో పుడ్తే బాగుండేనని అనుకుంటుంది. ఎప్పటికో ఒకసారి చీరకొని కట్టుకుంటాను చూడు అంటుంటుంది' అన్నాడు.

ఎందుకో అతడి మాటలు ఆశ్చర్యంగా అన్పించాయి అతడు వెళ్ళిన వైపే చూస్తూ నిలబడిన నేను 'వాట్ వండర్‌ఫుల్ మాన్' అన్న షాప్ అసిస్టెంట్ మాటలతో ఉలిక్కి పడ్డాను.

'ఎప్పుడొచ్చినా తన భార్య గురించి తప్ప మరో విషయమే మాట్లాడడు ఎంత ప్రేమో ఆమె అంటే ఎవరో ఆ అదృష్టవంతురాలు ఎప్పుడూ చూడలేదు ఫొటొతప్ప' అంటూ నా వస్తువులు ప్యాక్ చేసిస్తూ ఎందుకో చిన్నగా నిట్టూర్చింది.

ఆ తర్వాత ఓ రోజు ఉదయాన్నే పిల్లల్ని స్కూలుకి పంపించి వస్తూండగా పువ్వులు కొని ఫ్లోరిస్ట్ షాప్ లోంచి బయటకి వస్తూ కన్పించాడు. నాకన్నా ముందే తనే 'హల్లో' అంటూ పలకరింపుగా నవ్వుతూ 'ఇది నా భార్య కోసం కొన్నాను, మంచి పూలు కావాలంటే ఇంతదూరం రావాల్సిందే' తన చేతుల్లో ఉన్న ఎర్ర గులాబీలు చూపిస్తూ అన్నాడు.

నిజంగానే అప్పుడే విచ్చుకొన్నట్టుగా ఉన్న మంచుల్లో తడిసిన ఆకులతో కోసిన ఎర్ర గులాబీలు ఫ్రెష్‌గా అందంగా ఉన్నాయి.

'నా జెన్నీ ఎప్పుడూ అడగదు ఇది కావాలి అదికావాలి అంటూ కానీ పువ్వులంటే మాత్రం గొప్ప ఇష్టం. అప్పట్లో మా పెళ్ళైన క్రొత్తలో సెకండ్ వరల్డ్ వార్ లో అన్నీ పోగొట్టుకుని రోజు కూలీ వెతుక్కుంటూ నా దగ్గర ఒక చిన్న పువ్వు కొనాలన్నా డబ్బులుండేవి కావు. 'కనీసం నీ కోసం పువ్వులైనా కొనలేను కదా నేను" అంటూ బాధపడేనన్ను 'మీమనసు, మీప్రేమ, మీరే నాకు లోకంలోని సంపదలూ, మీ ప్రేమను మించిన మరే కోరికా లేదు నాకు అంటూ ఓదార్చేది నన్ను' ఎందుకో అతడి కళ్ళల్లో సన్నటి నీటి పొర.

అతడి మాటల్లో, అతడి కళ్ళల్లో ప్రతిఫలించే జెన్నీ పై ఆరాధనా భావం చూస్తుంటే 'లోకంలో కెల్లా గొప్ప ప్రేమికుడు ఇతడేనేమో' అనుకోకుండా ఉండలేక పోయాను.

ఓ ఆదివారం పార్క్‌లో కన్పించాడు జాన్. సెడార్ ట్రీ క్రింద కూర్చుని ఆడుకునే పిల్లలను తిలకిస్తున్నా అతడి మనసు మాత్రం మరోలోకంలో ఉన్నట్టు అప్పుడప్పుడు అతని పెదవులపై కదలాడే హాస రేఖలు చెప్పకనే చెప్తున్నాయి.

పిల్లలను స్వింగ్స్ తో ఆడుకోమని చెప్పి నేనే వెళ్ళి పలకరించాను. ఎందుకో అతడు ఎప్పుడూ జెన్నీ గురించి మాట్లాడినా, ఆమె విషయాలు చెప్పినా మళ్ళీ మళ్ళీ వినాలన్పించేంత ఇంటరెస్టింగ్‌గా ఉంటాయి.

నన్ను చూడగానే 'హలో హలో! కమ్ అండ్ సిట్‌హియర్' అంటూ ప్రక్కకు జరిగాడు. 'హౌ ఆర్ యూ' అంటూ అడిగాను కాస్త దూరంలో కూర్చుంటూ. 'ఫైన్ థ్యాంక్ యూ' అన్నాడు ఎందుకో వచ్చేనవ్వును అతి ప్రయత్నం పై ఆపుకుంటూ. మళ్ళీ తనే ప్రశ్నార్థకంగా ఉన్న నా చూపును గమనించి కాబోలు 'ఎప్పటి విషయమో చాలా ఏళ్ళ క్రిందటి మాట ఓ క్రిస్మస్ పండుగ నాటి సంఘటన గుర్తొస్తే నవ్వు కుంటున్నాను.

ఇదివరకే చెప్పాను కదూ! వార్‌లో అన్నీ పోగొట్టుకుని రోజు గడవటమే కష్టమయ్యేదని, అయితే అతికష్టం పై ఓ చిన్న ఫ్యాక్టరీలో అతి చిన్న వేతనంపై ఉద్యోగం వచ్చింది నాకు. దానికే జెన్నీ ఎంతో సంబరపడిపోయింది. ఆమె సంబరం చూసి అనుకున్నాను. కనీసం ఆ క్రిస్మస్ కైనా జెన్నీకి మంచి స్టవ్ ఒకటి కొనివ్వాలని పాపం రోజూ వెలిగీ వెలగని పాతస్టవ్‌తో కుస్తీలు పడ్తుండేది.

అప్పుడు మా ఇంట్లో ఎక్కువ సామాన్లు ఉండేవి కావు. వార్ జరుగుతున్నప్పుడు బాంబ్‌పడి అన్నీ పోగొట్టు కున్నా, మా ఇద్దరి ప్రాణాలుతో పాటు ఎప్పటిదో ఓ చైనా బాక్స్ మాత్రం మిగిలింది.

ప్రతి వారం ఎంతో కొంత అతి ప్రయాసతో మిగిల్చి ఓ చిన్న గూటిలో కదలకుండా ఉన్న ఆ బాక్స్‌లో వేస్తుండేవాడిని.

చివరికి క్రిస్మస్ రెండు రోజులుండనగా జెన్నీకి తెలియకుండా ఆ డబ్బు తో క్రొత్తస్టవ్ కొన్నాను. ఎందుకో అనుకున్నదాని కన్నా ఎక్కువే ఉన్నాయి ఆ బాక్స్‌లో డబ్బులు. అందుకే సరిగ్గా సరిపోయాయి. ఆ సాయంత్రం ఇంటికెళ్ళే సరికి ఎదురుగా వచ్చింద్ది జెన్నీ 'చైనాబాక్స్‌లో డబ్బులు తీశారా?' అంటూ 'అంటే నీకు తెల్సా?' అన్నాను ఆశ్చర్యపోతూ 'తెలియకపోవడానికి ఎవరున్నారీ ఇంట్లో అనుకున్నాను మీరే తీసుంటారని' అంది అలుకగా.

ఆ డబ్బులు ఎందుకలా సేవ్ చేశానో జెన్నీ కోసం ఏం కొన్నానో తెప్పాను. అంతా అత్యంతాశ్చర్యంగా కళ్ళు పెద్దవి చేసుకుని విని చివరికి అంది. 'నేను కూడా రోజూ ఖర్చులు కొంత తగ్గించుకుని ప్రతివారం ఒక షిల్లింగ్ వేసేదాన్ని ఆ చైనా బాక్స్‌లో. మీరూ వేస్తున్నారని తెలియదు నాకు. కానీ వాటిలో మీ కోసం షూ కొనాలనుకున్నాను' పాత బడి కుట్లూడిపోతున్నా నా షూవేపు చూస్తూ 'ఇప్పుడు నా కాస్టవ్ అవసరం లేదు వాపసిచ్చేసి డబ్బులు తీసుకురండి' అంది కళ్ళు నీళ్ళలో నిండుకోగా ఉక్రోషంగా.

ఆ తర్వాత జెన్నీకెంత నచ్చచెప్పినా మూడు రోజుల తర్వాతగానీ వాడలేదాస్టవ్.

మరో రెండు నెలల్లో జెన్నీ పట్టువల్ల ఇద్దరం కలిసి సేల్‌చేసి జెన్నీనే బజారుకు వెళ్ళీ షూకొంది నాకోసం. అప్పటికి గానీ పూర్తిగా పోలేదు ఆమె కోపం నామీదా. నేవ్ మీదా' పకపకా నవ్వుతూన్న జాన్‌తో పాటు నేనూ చిన్నగా నైనా నవ్వకుండా ఉండలేకపోయాను. ఆ ఆది దంపతుల గురించి. ఆ ఆదర్శ దంపతుల గురించి ఆలోచిస్తూంటే ముచ్చటగా అన్పించారు. ఎందుకో జెన్నీ ఎలా ఉంటుందో చూడాలన్పించసాగింది.

మరో ఆదివారం మళ్ళీ పార్క్‌లో అదేచోట కన్పించాడు. నన్ను చూడగానే 'వచ్చేవారమే నాజెన్నీ బర్త్‌డే ప్రెజెంట్ ఏమివ్వాలా అని ఆలోచిస్తున్నాను.' అన్నాడు. 'ఆమెనే అడగకూడదా?' అన్నాను నేను. 'నో నో. ఐ వాంట్ టు గివ్‌హర్ ఎ సర్ప్రైజ్. అందుకే ఇక్కడకొచ్చాను ఆలోచించుకోడానికి అంటూ 'హేవ్‌యూ ఎనీ ఐడియా?' జేబు లోంచి ఫొటోతీసి చూపించాడు. 'ఈమెకి తగిన ప్రెజెంట్ ఏముంటుందో నీవూ ఆలోచించు' అంటూ.

ఆ ఫొటో చూస్తూంటే అంతులేని ఆశ్చర్యం కల్గింది నాకు. తేనెకళ్ళతో. బంగారు రంగు ఉంగరాలజుట్టుతో. అందంగా నవ్వుతూన్న ఆ స్త్రీ ముప్పై ఏళ్ళ ముగ్ధలా ఉంది కానీ అరవై ఏళ్ళు పైబడిన వృద్ధురాలిగా అస్సలు లేదు.

నా ఆశ్చర్యం గమనించి కాబోలు జాన్ ఫొటో నాచేతిలోంచి తీసుకుని కవర్‌లో పెడుతూ 'నీలాగే అందరూ ఆశ్చర్యపోతారు నా జెన్నీని చూసి. వృద్ధాప్యమనేదే ఆమె దరి చేరనంత ఇదిగా కాపాడుకుంటుంది శరీరాన్ని తగినంత ఎక్సర్‌సైజ్ చేస్తూ. మితంగా ఆహారం తీసుకుంటూ.' ముసిముసిగా నవ్వు తూన్న ముడతలు పడిన అతడి డెబ్బై ఏళ్ళ ముఖంలోని గాజుకళ్ళ లో క్షణకాలం తన జెన్నీ ఎడల గర్వం తళుక్కుమంది.



రోజూ ఉదయాన్నే పువ్వుల షాపు దగ్గర. ఆదివారాలు పార్క్‌లో. ఒక్కోసారి కార్నర్ షాప్‌లో జాన్ కలవడం. జెన్నీ గురించి అతడు చెప్తూండగా వినడం దినచర్యలో ఒక భాగంగా మారిపోయింది.

ఆరోజు ఉదయాన్నే పూలు కొనుక్కుని వస్తూ కన్పించి చెప్పాడు జెన్నీకోసం బర్త్‌డే ప్రెజెంట్ కొన్నానంటూ. డైమండ్‌షేప్‌లో మధ్యన 'J' ఆకారంలో తెల్లరాళ్ళు పొదగబడి చిన్న గోల్డ్ పెండెంట్ చూపించాడు. 'చాలా




అందంగా ఉంది అన్నాను. మెచ్చుకోలుగా ఎన్నో ఏళ్ళుగా తన చెయిన్‌లోకి ఇలాంటి పెండెంట్ కొనుక్కోమని చెప్తూ అంత ఖరీదెందుకని వినేది కాదు. అందుకే తనకు తెలియకుండా కొనాలని సంవత్సరం నుండీ నెలనెలా నా పెన్షన్ డబ్బుల్లోంచి కొంత దాచిపెడ్తూ వచ్చాను. అయినా దీనికి సరిపోయే డబ్బులేక పోయింది. అందుకే ఇన్ని రోజులూ ఆలోచించాను. ఏంకొనాలా అని చివరికి నిన్న ఒక ఫ్రెండ్ దగ్గర కొద్దిగా అప్పు తీసుకుని ఈ పెండెంట్ కొనడానికే నిర్ణయించుకున్నాను.

ఎన్నో ఏళ్ళుగా కొనలేని కానుక ఇన్నాళ్ళకైనా తన జెన్నీ కోసం కొన్నాననే తృప్తి అతని కళ్ళల్లో.

అదే ఆఖరిసారి అతడు నాకు కన్పించడం. ఆమరునాడు పువ్వుల షాపుకి రాకుంటే అనుకున్నాను జెన్నీ బర్త్‌డే కదా. బిజీగా ఉండి ఉంటాడని. కానీ వారం రోజులుగా ఎక్కడా కన్పించకుంటే ఏం తోచకుండా ఉంది. అసలు జాన్ ఎలా ఉన్నాడో. ఆరోగ్యం సరిగా ఉందో లేదో అనే అనుమానం కల్గించసాగింది. ఎందుకో కార్నర్ షాపులో అడిగితే చెప్తారేమో అతడి గురించి అన్పించింది. వెంటనే బయల్దేరాను షాప్ అసిస్టెంట్ లూసీ దగ్గరికి—

జాన్ గురించి తెల్సుకున్న నాకు ఆ రాత్రంతా నిద్రే పట్టలేదు. ఎందుకో అతడి గురించి విన్నదంతా నమ్మలేకపోతున్నాను.

జాన్ పిచ్చివాడా? అతడి భార్య జెన్నీ ఎప్పుడో పదిహేనేళ్ళ క్రితమే చనిపోయిందా? జాన్ కొడుకు. కోడలు. అల్లుడు జెన్నీ కోసం అంటూ చేసే పిచ్చిపనులు భరించలేక. జెన్నీ కోసం అంటూ అతడి పెన్షన్ డబ్బులు


'జెట్' ఇంటికి తెండి, దోమలను బయటకు తరమండి.



జెట్ దోమలను పారద్రోలతే పొందండి నిద్ర సుఖం.

పొగ వస్తుందనే బాధలేదు. బూడిద రాలుతుందనే సమస్యలేదు. అశుభ్రత అనే మాటేలేదు. మరెలాంటి బాదరబందీలేదు. బటన్ అలా నొక్కితే చాలు. సువాసనలు వెదజల్లుతూ జెట్ పనిచేయటం మొదలెడ్తే. హాయిగా నిద్ర పోండి "జెట్" తక్షణం దోమలను తరిమివేసే విద్యుత్ ఉపకరణం. జపాను దేశపు సరికొత్త సాంకేతికతతో తయారు చేయబడినది. ఇది దోమలను వెంటనే తరిమివేసే, ఆధునిక కాలపు ఒక శుభ్రమైన పద్ధతి.. ప్రభావవంతం, మితవ్యయకరం. దోమలను తొలగిస్తుంది తక్షణం. మరి నేడే జెట్ తెండి. దోమలను వెంటనే తరిమి వేయండి.
జెట్ మస్కిటో రిపెల్లర్

తయారు చేయువారు :
ప్లాస్టోమెక్స్ (ఇండియా)
38, పటేల్ నగర్,
ఇందోర్–452 004.
ఫోన్ : 35455, 60507.

Jet

Bidhan-PL-11-Tel

ఖర్చుపెట్టడం ఇష్టంలేక, జెన్నీ బ్రతికే ఉందనే భ్రమలో బ్రతికే అతడిని సైకియాట్రిక్ హాస్పిటల్‌లో జాయిన్ చేశారా! నమ్మలేక పోతున్నాను.

ఈ నెలరోజుల పరిచయంలో అతడు ఏనాడూ పిచ్చివాడులా అన్పించలేదు. కాకపోతే భార్యను అమితంగా ప్రేమించే భర్తగా, ఆరాధించే ప్రేమ పూజారిలా కన్పించాడు అంతే. 'నిజంగా జెన్నీ ఎంత అదృష్టవంతురాలు ఎవరితోనూ ప్రేమించ బడకుండా నూరేళ్ళు బ్రతికే బదులు జాన్ లాంటి వ్యక్తితో జెన్నీలా ప్రేమించబడే నూరు క్షణాలు బ్రతికినా చాలు అనుకోకుండా ఉండలేక పోయాను.

ఇప్పుడు హాస్పిటల్‌లో అతడికి ట్రీట్‌మెంట్ ఇచ్చి జెన్నీ బ్రతికి లేదని, చనిపోయిందనే ఘోరమైన నిజాన్ని అతడికి తెలియజెప్పి అతడి హృదయాన్ని బ్రద్దలు చేస్తారా?

ఎందుకో ఒక్కసారిగా గలగలా నవ్వుతున్న అతని రూపం కళ్ళముందు కదలాడింది. వయసు భారంతో వంగి పోయి ఇంకా ఎంతో కాలం బ్రతకడన్పించే అతడిని ఈ కాస్త బ్రతికినంత కాలమూ అతడి కలల ప్రపంచం నుండి అతడిని జెన్నీ లోకం నుండి వేరు చేసి కమ్మని భ్రమలోంచి క్రూరమైన వాస్తవంలోకి తీసుకొచ్చి చివరి దశలో జెన్నీకోసం కుమిలిపోతూ అశాంతిగా బ్రతక మంటున్న అతడి కొడుకు, కోడలు, సైకి యాట్రిస్టుల నిర్ణయం ఎందుకో అంత సమంజసంలా అన్పించ లేదు నాకు. నాకే శక్తి ఉంటే అతడినా జైలు లాంటి హాస్పిటల్ నుంచి తప్పించి మళ్ళీ అతడి జెన్నీ లోకంలోకి తీసుకురావాలన్పించింది.

'వారం రోజుల క్రితం తన భార్య బర్త్‌డే అంటూ ఒక ఖరీదైన గోల్డ్ పెండెంట్ తెచ్చి అందరికీ చూపించి ఆ సాయంత్రం అది తీసికెళ్ళి జెన్నీ సమాధిపై ఉంచి వచ్చాడట. అలాంటిదేదో చేస్తాడనే అతడి కొడుకు కోడలు కనిపెట్టి ఉన్నారట.

జాన్ ననుసరించి శ్మశానం వరకూ వెళ్ళారు కాబట్టి ఆ పెండెంట్ మళ్ళీ ఇంటికి తెచ్చుకో గలిగారు. లేకుంటే ఈపాటికి ఎవరి చేతిలోనో పడేదే కదా' సూసీ మాటలు చెవిలో మార్మోగుతూంటే అన్పించసాగింది· జాన్‌కి జెన్నీపైగల ప్రేమ ముందు ఆ బంగారవు పెండెంట్ విలువ ఏపాటిదని? వాళ్ళలా జానేకి తెలియకుండా పెండెంట్ ఇంటికి తీసుకు రావడం ఎందుకో ఘోరంగా, క్రూరంగా అన్పించసాగింది.

'ఈ లోకం ఏ ప్రేమికులను సుఖ పడనిచ్చింది గనుక' అనుకున్నాను నిట్టూర్పును ఆపుకుంటూ. ●

## విదేశాలకు నేరుగా ఫోన్ చేయడం ఎలా?

వార్తా ప్రసార రంగంలోనూ తంతి తపాలా విభాగాలలోనూ వచ్చిన విప్లవాత్మకమైన మార్పులవలన ఇప్పుడు మనం దాదాపు 24 దేశాలకు పరాసరి టెలిఫోన్‌లు చేసుకో గలుగుతున్నాం. విదేశాలకు ఎలా ఫోన్ చేసుకోవాలో ఇక్కడ వివరణ ఇవ్వడం జరిగింది.

ఏ విదేశానికి ఫోన్ చేయాలన్నా ముందుగా 00 తిప్పాలి.

ఆ తర్వాత ఆ దేశపు కోడ్ నంబర్ తిప్పాలి.

ఆ పైన అక్కడి ఏరియా నంబరు తిప్పాలి.

చివరగా ఎవరికి ఫోన్ చేయాలంటే వారి నంబరు డయల్ చేయాలి. ఇదీ పద్ధతి.

ఒక సెకనుకు లోకల్ కాల్‌కి అయే చార్జి అంతర్జాతీయంగా మనం చేసే ఫోన్ కాల్‌కి అవుతుంది.

ఇక్కడ 24 దేశాల పేర్లు, వాటి కోడ్ నంబర్లు మనకు, ఆ దేశాలకు గల టైమ్ తేడా వివరాలు ఇస్తున్నాం.

| దేశం పేరు | దేశం కోడ్ | టైమ్ తేడా గంటలలో |
|---|---|---|
| 1. ఆస్ట్రియా | 43 | 3-30 వెనుక |
| 2. ఆస్ట్రేలియా | 61 | 4-30 ముందు |
| 3. బెల్జియం | 32 | 3-30 వెనుక |
| 4. బోట్స్‌వానా | 267 | 3-30 వెనుక |
| 5. డెన్మార్క్ | 45 | 3-30 వెనుక |
| 6. ఫెడరల్ రిపబ్లిక్ ఆఫ్ జర్మనీ | 49 | 3-30 వెనుక |
| 7. ఫిన్లెండ్ | 358 | 2-30 వెనుక |
| 8. ఫ్రాన్స్ | 33 | 3-30 వెనుక |
| 9. హాంగ్‌కాంగ్ | 852 | 2-30 ముందు |
| 10. ఇటలీ | 39 | 3-30 వెనుక |
| 11. జపాన్ | 81 | 3-30 ముందు |
| 12. కెన్యా | 254 | 2-30 వెనుక |
| 13. మలేసియా | 60 | 2-00 ముందు |
| 14. నెదర్లాండ్స్ | 31 | 3-30 వెనుక |
| 15. నార్వే | 47 | 3-30 వెనుక |
| 16. సింగపూర్ | 65 | 2-00 ముందు |
| 17. స్వీడన్ | 46 | 3-30 వెనుక |
| 18. టర్కీ | 90 | 2-30 వెనుక |
| 19. ఇంగ్లండ్ | 44 | 4-30 వెనుక |
| 20. అమెరికా | 1 | 9-30 నుంచి 12-30 వరకు వెనుక |
| 21. రష్యా | 7 | 2-30 వెనుక |
| 22. జాంబియా | 260 | 3-30 వెనుక |
| 23. స్విట్జర్లాండ్ | 41 | 3-30 వెనుక |
| 24. జింబాబ్వే | 263 | 3-30 వెనుక |